నత్తనడకన పనులు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మన బడి– మన ఊరు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆకర్షణీయమైన భవనాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, అభ్యసనానికి ఉపయోగపడే వనరులు, విద్యార్థులను పాఠశాల వైపు ఆకర్షించి, చదువుపై ఆసక్తి కల్పించేందుకు ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగా పలు పాఠశాలలను ఎంపిక చేసి పనులు చేపట్టారు. అయితే, నిధుల విడుదల జాప్యం వల్ల పనులు ముందుకు సాగడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- అసంపూర్తిగా పాఠశాల భవనం
- అరకొర వసతుల మధ్య విద్యార్థుల చదువులు



అసంపూర్తిగా ఉన్నత పాఠశాల భవనం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. బిల్లుల విడుదలలో జాప్యం వల్ల కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశారు. తరగతి గదుల్లో అరకొర వసతులు నడుమ విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని ప్రారంభించింది. పలు పాఠశాలలను ఎంపిక చేసి, వివిధ రకాల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి సుమారు కోటి రూపాయలు మంజూరు చేసింది. అదనపు తరగతి గదుల నిర్మాణం, మూత్రశాలలు, ప్రహరీ, వంట గదుల నిర్మాణం, రంగులు వేయడం, వంటి పనులు చేపట్టాలి. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ప్రారంభంలో నిర్మాణం పనులు శరవేగంతో చేపట్టి, దాదాపు 80 శాతం పనులు పూర్తి చేశారు. ప్రహరీ, మూత్రశాలల నిర్మాణం, రంగులు వేయడం, కరెంట్ తదితర పనులు మిగిలాయి. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను ఆపేశాడు. పాఠశాల భవనం దశాబ్దాల క్రితం నిర్మించడంతో శిథిలావస్థకు చేరింది. 500 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో సరిపడ గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తిగా ఉన్న పాఠశాల గదులను పూర్తి చేసి కొత్త భవనంలో తరగతులు నడపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రారంభమైన పనులు



పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం పనులు నడుస్తున్నాయి, జిల్లా కలెక్టర్ శ్రద్ధ తీసుకుని ఆగిపోయిన పనులను పూర్తి చేయిస్తున్నారు. పంచాయతీ రాజ్ శాఖ అధికారులు కొత్త కాంట్రాక్టర్‌తో పనులను చేయిస్తున్నారు. త్వరలో పాఠశాల భవనం పనులు పూర్తి అవుతాయి.

–బస్వరాజ్, ఎంఈఓ, జహీరాబాద్

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: సీఎం సహాయనిధి నుంచి నిజాంపేట మండలం రాంరెడ్డిపేటకు చెందిన పార్వతికి రూ.24 వేలు, మేఘ్యానాయక్ తండాకు చెందిన శ్రీయాన్స్ నాయక్‌కు రూ.9 వేలు, నేనావత్ భీమ్ని నాయక్‌కు రూ.18 వేలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కులను శుక్రవారం ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి లబ్ధిదారులను అందజేశారు. ఖేడ్ మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, నిజాంపేట తాజా మాజీ సర్పంచ్ జగదీశ్వరాచారి, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్ పాల్గొన్నారు.

అభివృద్ధికి నిరంతరం కృషి

జిన్నారం (పటాన్ చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ కొలన్ రోజా శనివారం శంకుస్థాపన చేశారు. 7, 8వ వార్డుల్లో రూ.50 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దశలవారీగా మున్సిపాలిటీ సమస్యలను పరిష్కరించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్, ఏఈ కిష్టయ్య, స్థానికులు నబీ, శ్రీను, గణపతి, కాలనీవాసులు మహిళలు పాల్గొన్నారు.

మండల బీఆర్ఎస్ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడిగా ప్రభాకర్ రెడ్డి ఎన్నికయ్యారు. శనివారం మండల కేంద్రంలో రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ప్రభాకర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని హనుమాన్ మందిరం పునఃప్రారంభోత్సవంలో భాగంగా ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని ఆయా వీధుల గుండా భజన చేస్తూ భక్తిపాటలు ఆలపించారు. భక్తులు జై హనుమాన్, జై శ్రీరామ్ అంటూ స్మరించారు. అభిషేకం, జలదివాసం, నవగ్రహ హోమం, నవగ్రహ మండలం, వాస్తు మండలం పూజనం, స్థాపనం, అగ్నిమంథనం తదితర ప్రత్యేక పూజలు చేశారు.

చెత్తాచెదారం తొలగింపు



చెత్తను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

ఝరాసంగం(జహీరాబాద్): ప్యారవరం గ్రామంలో 'పారిశుద్ధ్యం అస్తవ్యస్తం' సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి చెత్తను తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

సదాశివపేట(సంగారెడ్డి): భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం తక్షణమే గుర్తింపు కార్డులు, వృద్ధ కార్మికులకు ఐదువేల పింఛన్, లేబర్ అడ్డాలను నిర్మించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బోయిన్ ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తాజోద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన భవన నిర్మాణ రంగ ముఖ్యకార్మికుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ రంగ కార్మికులకు గుర్తింపు కార్డులు లేకపోవడంతో ప్రమాదాల బారిన పడినవారికి సరైన వైద్యం, ఇతర సహాయ సహకారాలు అందక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వసూలు చేస్తున్న సెస్ ఒక శాతం నుంచి రెండు శాతానికి పెంచి కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

కేసులను త్వరగా పరిష్కరించాలి



ఖైదీలతో మాట్లాడుతున్న రమేష్

సంగారెడ్డి టౌన్: కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. శనివారం కందిలోని సెంట్రల్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైదీలకు సదుపాయాలు కల్పిస్తూ ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వంటశాల, పరిసరాలను పరిశీలించారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా ఉచిత సేవలు పొందవచ్చని ఖైదీలకు తెలియజేశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్, న్యాయవాదులు పాల్గొన్నారు.

పిల్లల చదువు తల్లిదండ్రుల బాధ్యత



మాట్లాడుతున్న జిల్లా అకాడమి మానిటరింగ్ అధికారి వెంకటేశం

మునిపల్లి(అందోల్): ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను ఇంటి దగ్గర పిల్లలను చదివించే బాధ్యత తల్లిదండ్రులదేనని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి వెంకటేశం అన్నారు.శుక్రవారం మండలంలోని మల్లికార్జునపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఎంఈఓ భీమ్‌సింగ్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థిని, విద్యార్థులకు ప్రతి నెల రూ.6 వందల రూపాయలు చార్జీ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందన్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలతో పాటు భోజన సౌకర్యం కల్పించడం జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంగమేశ్వర్, అమ్మఆదర్శ పాఠశాల చైర్మన్ మణిక్యమ్మ, అశోక్‌కుమార్, రమణ, నాగమణి, గుణాకర్, గౌడ్, జ్యోతి, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భాగస్వామ్యం తప్పనిసరి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పనిసరి అని ప్రధానోపాధ్యాయుడు పోట్రు రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మీనా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో విద్యార్థుల హాజరు, బేసిక్స్(చదవడం రాయడం, చతుర్విధ ప్రక్రియలు) విద్యార్థుల ప్రగతి గురించి చర్చించారు. విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడేలా ప్రోత్సహించాలని, మధ్యాహ్న భోజనం, నాణ్యత, శుభ్రంగా ఉండాలని తల్లిదండ్రులు సూచించారు. ఉపాధ్యాయుల పనితీరుపై విద్యార్థులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవనీత, సునీత తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కార్మికులు

నారాయణఖేడ్: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో శనివారం శానిటరీ అధికారి శ్రీనివాస్, పారిశుద్ధ్య కార్మికులు, చెత్త సేకరణ ఆటోల డ్రైవర్లు తడి, పొడి చెత్తపై ఆయా వార్డుల ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇళ్ల వద్దకు వచ్చే చెత్త తరలింపు ఆటోలకు ఇవ్వాలని సూచించారు. స్వచ్ఛ ఖేడ్‌కు సహకరించాలని కోరారు.

కోదండరెడ్డికి అభినందనలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ

నారాయణఖేడ్: హైదరాబాద్‌లోని బీఆర్‌కె భవన్‌లో రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్‌గా కోదండరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శనివారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీతో కలిసి జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయరంగ అభివృద్ధి, రైతుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు.

'భరోసా'కు నిధులు లేక డ్రామాలు



ఎమ్మెల్యే ప్రభాకర్

సంగారెడ్డి : ఎన్నికల సమయంలో గొప్ప గొప్ప పథకాలు తెస్తామని చెప్పిన కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చాక ఉన్న పథకాలను ఊడగొట్టారని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానాకాలం రైతు భరోసాను ఎగగొట్టి రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేశారని అన్నారు. వర్షాకాలానికి రైతు భరోసా పోయినట్లే అని మంత్రి తుమ్మల చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రైతుల ఖాతాలో రైతు భరోసా వేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం పోయిందన్నారు. రైతు భరోసాకు డబ్బులు లేకపోవడంతోనే సబ్ కమిటీ అంటూ డ్రామాలు మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. రైతు భరోసా ఇచ్చే వరకు వదిలేది లేదని అన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరం అని ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఖేడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ఉచితంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్, శిక్షణా కేంద్రాన్ని ఫౌండేషన్ ఫౌండర్ కృష్ణ పాడిశెట్టితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండునెలల క్రితం రెండు పాఠశాలల్లో కంప్యూటర్ శిక్షణ ప్రారంభించారు. ప్రస్తుతం మూడో పాఠశాలలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ శిక్షణను ఏర్పాటు చేయిస్తామన్నారు. ఫౌండర్ కృష్ణ పాడిశెట్టి మాట్లాడుతూ.. కంప్యూటర్ నైపుణ్యాలతో పాటు సామాజిక, నైతిక విలువలు, ఆరోగ్యం, పోషణ, యోగా, ధ్యానం, మానసిక వికాసం తదితర అంశాలపై బోధన అందిస్తామన్నారు. ఫౌండేషన్ ట్రస్టీలు మాధవి, ఫణికుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ దారంశంకర్ సేట్, కౌన్సిలర్లు వివేకానంద్, హన్మాండ్లు, ప్రధానోపాధ్యాయులు శోభ, మన్మథకిషోర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహేష్ పాల్గొన్నారు. అనంతరం ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి పరిశీలించారు.

సబ్‌స్టేషన్‌కు స్థలం కేటాయించండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిను శనివారం కార్పొరేటర్ పుష్ప మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు విద్యుత్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో నూతన సబ్‌స్టేషన్‌కు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అందుకు కావాల్సిన స్థలాన్ని కేటాయించాలని కమిషనర్‌ను కోరారు. అలాగే, విద్యుత్ దీపాలు, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించారని చెప్పారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన



అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ కమర్షియల్ కాంప్లెక్స్ దుకాణాలను వినియోగంలోకి తేవాలని బీఆర్ఎస్ నాయకులు శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు నామ రవికిరణ్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణంలో రూ. 12 కోట్లతో 57 కాంప్లెక్స్ దుకాణాలను నిర్మించిందన్నారు. వ్యాపారుల వద్ద రూ. 2.50 లక్షల డిపాజిట్లుగా తీసుకుని దుకాణాలను అలాట్ చేయడం జరిగిందన్నారు. బకాయి బిల్లులు చెల్లించే వరకు కాంప్లెక్స్ దుకాణాలను అప్పగించనని కాంట్రాక్టర్ తాళం వేశారని చెప్పారు. మున్సిపల్ సమీక్ష సమావేశానికి ఇటీవల జహీరాబాద్‌కు వచ్చిన మంత్రి దామోదర రాజనర్సింహ్మకు విషయం తెలియడంతో కాంట్రాక్టర్‌తో మాట్లాడి తాళాలను మున్సిపల్ అధికారులకు అప్పగించారు. 8 నెలలు కావస్తున్నా మున్సిపల్ అధికారులు వ్యాపారులకు దుకాణాలను కేటాయించడం లేదన్నారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఎమ్మార్సీకి చేరిన ప్రశ్నపత్రాలు



ప్రశ్నపత్రాలు చూపుతున్న ఎంఈఓ తదితరులు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఈనెల 21 నుంచి ఎస్ఏ–1 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అందుకు సంబంధించిన ప్రశ్నపత్రాలు రెండు రోజుల క్రితం ఎమ్మార్సీకి వచ్చినట్లు ఎంఈఓ మారుతి రాథోడ్ తెలిపారు. 21 నుంచి 28వ వరకు ఎస్ఏ–1 పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, అందుకు సంబంధించిన ప్రశ్నపత్రాలు వచ్చాయని వాటిని సోమవారం నుంచి పంపిణీ చేస్తామని చెప్పారు. సీఆర్‌పీలు, హెచ్‌ఎంలు ఎమ్మార్సీకి వచ్చి తీసుకెళ్లాలని ఎంఈఓ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ దైవచింతనతో మానసిక ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని కోదండ సీతారామస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు.

◆ పీసీబీ అధికారుల తీరుపై ఆగ్రహం

జిన్నారం (పటాన్ చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని లీ ఫార్మా పరిశ్రమపై పీసీబీ అధికారుల తీరు విడ్డూరంగా ఉందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 28న పీసీబీ రాష్ట్ర కార్యాలయంతో పాటు రామచంద్రపురంలోని రీజినల్ కార్యాలయంలో గ్రామస్తులు పరిశ్రమపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. కాని, ఎలాంటి చర్యలు తీసుకోలేని మండిపడ్డారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో గ్రామస్తులు బాలయ్య, నాగరాజు, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

◆ ఎయిడ్స్‌పై కళాజాత

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎయిడ్స్‌పై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. స్కోప్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ ఎలా వస్తుంది..? తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాత బృందం సభ్యులు వివరించారు. కార్యక్రమంలో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించాలి

జిన్నారం (పటాన్ చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ కాలనీవాసులు నూతన కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ మంగతాయారును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి హయాంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించారని తెలిపారు. తర్వాత మున్సిపల్ ప్రజాప్రతినిధులు పెద్దల సూచనతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ బస్తీ దవాఖానగా మార్చారని చెప్పారు. మళ్లీ నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం సహకరిస్తానని చెప్పి ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. కౌన్సిలర్ వేణుపాల్ రెడ్డి మున్సిపల్ సమావేశంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయాలని ప్రస్తావించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్సీ కమిటీ హాల్ నిర్మాణాన్ని చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బస్తీవాసులు ప్రవీణ్ కుమార్, యాదగిరి శ్రీనివాస్ రామకృష్ణ ముత్యాలు కాశి రాజశేఖర్ పాల్గొన్నారు.

◆ పాము కలకలం

సంగారెడ్డి టౌన్ : మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం పాము కలకలం సృష్టించింది. కార్యాలయంలోకి పాము రావడంతో ఉద్యోగులు భయాందోళన చెందారు. ఉద్యోగులు కార్యాలయం నుంచి బయటకు వచ్చి కర్రలతో పామును బయటకు పంపించారు. కార్యాలయం చుట్టూ ఉన్న పొదలను తీసివేయాలని పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని స్థానికులు కోరారు.

◆ డబుల్ ఇళ్ల సందర్శన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేంద్ర పట్టణ గృహ నిర్మాణ శాఖ జాయింట్ డైరెక్టర్ కుల్దీప్ నారాయణ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించి, సౌకర్యాలను అక్కడివారిని అడిగి తెలుసుకున్నారు.

◆ కొనసాగుతున్న విగ్రహాల ప్రతిష్ఠాపన

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని ఖలీల్‌పూర్‌లో గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రెండవ రోజు శనివారం ఊరడమ్మ, లక్ష్మీదేవి, భూలక్ష్మి, పోచమ్మ, కేశమ్మ, నాగులు, బొడ్రాయి, విగ్రహాల ప్రతిష్ఠాపన, అలంకరణ, చండి హోమం, బలిహారణ, పూర్ణాహుతి ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

◆ రెవెన్యూ కార్యాలయం సందర్శన



రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఒడిశా రాష్ట్రానికి చెందిన ట్రైనీ ఐఏఎస్ బృందం సందర్శించారు. రెవెన్యూ రికార్డులు, ధరణి పనితీరుపై వారికి వివరించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి వివరించారు.

◆ మొరం తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

వట్‌పల్లి(అందోల్): అనుమతి లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తున్నారని సమాచారంతో రెవెన్యూ సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి ట్రాక్టర్‌ను అడ్డుకొని రూ.5వేల జరిమానా విధించి వదిలేశారు.

◆ కష్టపడే వారికి పార్టీ ప్రాధాన్యం

పటాన్‌చెరు టౌన్: బీజేపీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని సెంట్రల్ టెలికం బోర్డు మెంబర్ బైండ్ల కుమార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. 1995 నుంచి బీజేపీ కోసం కష్టపడుతున్న తనకు పార్టీ గుర్తించి సెంట్రల్ టెలికం బోర్డు మెంబర్‌గా అవకాశం ఇచ్చి ందని, పార్టీ ప్రతి ఒకరిని గుర్తించి అవకాశాలు ఇస్తుందని తెలిపారు. అనంతరం బీజేపీ నాయకులు బైండ్లకుమార్‌ను సన్మానించారు.

◆ అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలి

నారాయణఖేడ్: అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమెలమాణిక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఖేడ్‌లో నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా రేషన్ కార్డుల పంపిణీ జరగలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరించినా ఇంకా పంపిణీ చేయలేదన్నారు. నియోజకవర్గంలోని రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని, వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. పార్టీ ఖేడ్ ప్రాంత కార్యదర్శి రమేష్, సతీష్ పాల్గొన్నారు.

◆ వ్యక్తి అదృశ్యం



వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని తాడ్మన్నూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధిత కుటుంబ సభ్యులు కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన మ్యాతరి లక్ష్మయ్య 20 రోజుల క్రితం పని నిమిత్తం మెదక్‌కు వెళ్లాడు. పనికి వెళ్లిన వ్యక్తి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

◆ ఆరుగురిపై కేసు నమోదు

కల్హేర్(నారాయణఖేడ్): పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సిర్గాపూర్ ఎస్ఐ డి.వెంకట్‌రెడ్డి శనివారం తెలిపారు. సిర్గాపూర్ మండలం అంతర్‌గాం సమీపంలో ఈగల్‌కుచ్చ వద్ద పేకాట ఆడుతున్నారని సమాచారం వచ్చింది. దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 5,180 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పర్చినట్లు చెప్పారు.

◆ ఎమ్మెల్సీని కలిసిన నేతలు

జహీరాబాద్: జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్సీ అమీర్‌అలీఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో జహీరాబాద్‌కు చెందిన మైనార్టీ అడ్వయిజరీ కమిషన్ మాజీ సభ్యుడు సద్రుద్దీన్‌గౌరి, జహీరాబాద్ సీడీసీ మాజీ చైర్మన్ శశికాంత్ పాటిల్‌లు కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

◆ టాయిలెట్ల ప్రారంభం

వట్‌పల్లి(అందోల్): మండలంలోని డాకూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏపీ మెట్ కంపెనీ ఆధ్వర్యంలో బాలికల కోసం నూతనంగా నిర్మించిన టాయిలెట్లను శనివారం కంపెనీ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అధికారి రామకృష్ణ ప్రారంభించారు. సీఎస్ఆర్ ఫండ్ కింద రూ.10 లక్షల వ్యయంతో పనులను చేపట్టారు. గ్రామానికి చెందిన జోహార్ రెడ్డి కంపెనీ యజమానులతో మాట్లాడి టాయిలెట్ల నిర్మాణానికి తోడ్పాటునందించారు.

◆ ఉత్తమ నటుడిగా సాయిరాం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్‌లో ఎస్ఈసీఆర్‌టీ (రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ) ఆధ్వర్యంలో రెండు రోజులుగా సైన్స్ డ్రామా ఫెస్టివల్ నిర్వహించారు. అందులో సంగారెడ్డి జిల్లా బీరంగూడ జెడ్పీహెచ్ఎస్ 10వ తరగతి విద్యార్థి సీహెచ్. సాయిరాం రాష్ట్రస్థాయి ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఈసీఆర్‌టీ డైరెక్టర్ రమేష్ విద్యార్థికి ప్రశంసా పత్రంతో పాటు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత తదితరులు అభినందించారు.

◆ ఆర్ఎంపీ క్లినిక్‌ల సీజ్



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్, పటాన్‌చెరు డివిజన్ బండ్లగూడలోని పలు ఆర్ఎంపీ క్లినిక్‌లను శనివారం రామచంద్రాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డా.నేత్రవతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బండ్లగూడలో ఒకటి, తెల్లాపూర్‌లోని ఒక క్లినిక్‌ను సీజ్ చేశారు.